కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడి నియామకం


వీరేశ్‌ముదిరాజ్‌కు నియామక పత్రం అందజేస్తున్న కాసాని

నిజాంపేట్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాచుపల్లికి చెందిన కాసాని వీరేశ్‌ముదిరాజ్ నియమితులయ్యారు. బాచుపల్లిలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో 15 మండలాలకు చెందిన కబడ్డీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా చంద్రహాస్, ఉపాధ్యక్షుడిగా తిరుమల్‌రెడ్డి, కోశాధికారిగా జీవీ సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శిగా రమాదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జహంగీర కృష్ణవేణి ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అశోక్‌యాదవ్ నూతన కమిటీకి అభినందనలు తెలిపి నియామక పత్రాలు అందజేశారు. ఎన్నికల అబ్జర్వర్లుగా స్టేట్ జాయింట్ సెక్రటరీ నర్సింగరావు, డిప్యూటీ ఎస్‌ఓ సుధాకర్‌రావు, అబ్జర్వర్స్‌గా స్టేట్ జాయింట్ సెక్రటరీ నర్సింగరావు, సీఐ మహేందర్‌రెడ్డి, హైకోర్టు అడ్వకేట్లు శ్రీనివాస్, దేవేందర్ వ్యవహరించారు

అపురూపకాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న గిరివర్ధన్ రెడ్డి

జీడిమెట్ల: అపురూప కాలనీలోని కాపు సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ (సత్తిబాబు) ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. మేడ్చల్ జిల్లా బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అత్యధిక సభ్యత్వాలు చేపట్టి వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎస్ వాసు, జిల్లా నాయకులు దేవర రమేశ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి విజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పాల్కం విష్ణుష్, బైండ్ల రాము, మహిళా మోర్చా కార్యదర్శి వనమాల రెడ్డి, గంధం కుమారస్వామి, గిరిబాబు, సత్తయ్య పాల్గొన్నారు.

ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి ప్రారంభించండి



ఉప కమిషనర్ నర్సింహకు వినతి పత్రం ఇస్తున్న మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్ చౌరస్తాలో నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్‌ను ప్రారంభించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్ కార్మికులతో కలిసి శనివారం ఉపకమిషనర్ నర్సింహకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ ఎస్కలేటర్‌పై షాపూర్‌నగర్ పేరును ముద్రించాలని, పాదాచారులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు త్వరగా అందుబాటులోకి తేవాలని కోరామన్నారు.

'సైబేజ్ ఆశ' ఆధ్వర్యంలో పాఠశాలల్లో సదుపాయాలు



జగద్గిరిగుట్ట: గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సైబేజ్ ఆశ ప్రోగ్రాం ద్వారా జగద్గిరిగుట్టలోని జడ్పీ, జగత్ గిరినగర్ ప్రభుత్వ పాఠశాలలో కల్పించిన సౌకర్యాలను ఆ కంపెనీ డెలివరీ మేనేజర్ హనుమారెడ్డి శనివారం ప్రారంభించారు. ఇటీవలే వారు వీటిని సందర్శించి 10 యూరినల్ బ్లాక్స్, పాత టాయిలెట్ ని పునరుద్ధరించి షెడ్ నిర్మించారు. దీంతో పాటు మొదటి అంతస్తులో ప్రహరీకి సేఫ్టీ గ్రిల్స్‌ని కట్టించారు. అలాగే స్కూల్ లో చేసిన వివిధ కార్యక్రమాలను తెలిపే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సీఎస్‌ఆర్ అనపురపు సురేశ్, స్కూల్ హెడ్ మాస్టర్ సుభాష్ చంద్రబోస్, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోడ్డుపై ఆయిల్ లీకేజీ.. అదుపుతప్పిన వాహనాలు



సుభాష్‌నగర్: రోడ్డుపై ఆయిల్ పడి పలువురు వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోయిన ఘటన జీడిమెట్ల డిపో వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే..టీఎస్ 15 యూఏ 4221 నంబర్ గల డీసీఎం గండిమైసమ్మ నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్తుంది. జీడిమెట్ల బస్ డిపో సమీపంలోని హనుమాన్ ఆలయం వద్దకు రాగానే శనివారం 4.30 గంటల సమయంలో డీసీఎంలో ఉన్న ట్రాన్స్‌ఫారం నుంచి ఆయిల్ లీకేజీ అయి 200 మీటర్ల వరకు రోడ్డుపైన పడిపోయింది. వెనకాల నుంచి వస్తున్న పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోయారు. మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోగా కొంతమందికి స్వల్పంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని క్రేన్ సాయంతో కాలేజీ బస్సును రోడ్డు పక్కన జరిపించారు. రోడ్డుపై పడ్డ ఆయిల్‌పై డస్ట్ పోయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

- అధ్వానంగా గిరినగర్ ప్రభుత్వ పాఠశాల
- స్కూల్ ఆవరణను ముంచెత్తుతున్న వరద, బురద
- పైకప్పు లీకేజీలు.. పెచ్చులూడుతున్న స్లాబ్
- ఆరు బయటే విద్యార్థులకు బోధన
- ఐదేళ్లుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

ఆరు బయటే చదువుకుంటున్న విద్యార్థులు


వర్షం వచ్చిందా.. చదువులు గోవిందా..!

ప్రభుత్వాలు మారుతున్నా.. సర్కారు బడుల పరిస్థితులు మాత్రం మారడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నామని ఓ వైపు అధికారులు, ప్రజాప్రతిధులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. దీంతో చాలా స్కూళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతూనే విద్యనభ్యసిస్తున్నారు.
–రంగారెడ్డినగర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 109 జిల్లా పరిషత్, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 25,526 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో జడ్పీ పాఠశాలలను మినహాయిస్తే ప్రాథమిక పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉన్నది. కొన్ని పాఠశాలల్లో మూత్రశాలలు లేవు. మరికొన్నింటిలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరతతో వేధిస్తున్నది. దీనికి తోడు కొన్ని పాఠశాలలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారినా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా గిరినగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల..

రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం 82 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో చాలామంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. అయితే పాఠశాల భవనం పైకప్పు నుంచి వర్షపునీరు లీకేజీ అవుతుండడంతో తరచూ స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. దీంతో తమ పిల్లలు ఎక్కడ గాయపడుతారోనని తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు విన్నవించినా అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో నామమంత్రంగా మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. మరో వైపు పలువురు విద్యార్థులు జ్వరాల బారిన పడటంతో హాజరు శాతం పడిపోయింది. 82 మంది విద్యార్థులకు గాను ప్రస్తుతం 52 మంది మాత్రమే తరగతులకు హాజరవుతున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఆరు బయటే చదువులు..

వర్షాకాలం వచ్చిందంటే చాలు గిరినగర్ ప్రభుత్వ పాఠశాలను వరద ముంచెత్తుతోంది.. భవనం రోడ్డుకు దిగువున ఉండడంతో వరదతో పాటు బురద పెద్ద మొత్తంలో తరగతి గదుల్లోకి చేరుతోంది. దీంతో విద్యార్థులు కూర్చునే పరిస్థితి లేకుండా పోతోంది. దీనికి తోడు పాఠశాల శ్లాబ్ నుంచి నీరు లీకవుతోంది. దీంతో ఉపాధ్యాయులు తరగతి గదుల్లో కాకుండా ఆరుబయటే పాఠాలు చెబుతున్నారు. ఐదేళ్లుగా పాఠశాల ఆవరణలోకి బురద చేరుతోందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.


గిరినగర్ ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

గిరినగర్ మండల పరిషత్ పాఠశాలను త్వరలోనే సందర్శిస్తాను. భవనం స్థితిగతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాను.
–జెమిని ఎస్ఎస్ కుమారి, ఎంఈవో కుత్బుల్లాపూర్


బురదమయంగా తరగతి గదులు



తరగతి గది పైకప్పు నుంచి వస్తున్న వర్షపు నీరు


పెచ్చులూడిన శ్లాబ్

భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం



తాపీ మేస్త్రీలకు బీమా బాండ్లు అందజేస్తున్న శివకుమార్, అయ్యప్పరెడ్డి

కుత్బుల్లాపూర్: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ శివ కుమార్ తెలిపారు. సూరారంలోని రాయల్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీలతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. తమ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, అలాగే స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన తమ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని పేర్కొన్నారు. అనంతరం 50 మంది తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్ సంగప్ప, భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ మార్కెటింగ్ అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికే జాతీయ లోక్ అదాలత్

కూకట్‌పల్లి: పరస్పర అంగీకారంతో కేసుల పరిష్కారానికే జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించినట్లు జిల్లా 3వ అదనపు న్యాయమూర్తి బి. తిరుపతి అన్నారు. కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం మండల్ లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టులో కేసులు వేసి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కేసుల పరిష్కారానికి 12 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పలు కేసుల్లో 32 కేసులను రాజీమార్గంలో పరిష్కరించామన్నారు. మల్కాజిగిరి జిల్లా 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పరిధిలోని కోర్టుల్లో 4032 కేసులు, రంగారెడ్డి 6వ జిల్లా అదనపు న్యాయమూర్తి పరిధిలోని కోర్టుల్లో 6055 కేసులను రాజీమార్గంలో పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ద గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాండ్ర రమేష్ కుమార్‌గౌడ్, 12 మంది జడ్జీలు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కౌమార విద్యపై అవగాహన



కూకట్‌పల్లి: మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లా స్థాయిలో కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు పోస్టర్ మేళా నిర్వహించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు మాట్లాడుతూ.. జిల్లాలో 73 ప్రభుత్వ ఉన్నత, 8 ప్రైవేట్ పాఠశాలల్లో కౌమార విద్యపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కౌమార దశలో బాలబాలికలకు కలిగే శారీరక, మానసిక ఉద్వేగ పరమైన మార్పుల గురించి అవగాహన కల్పించామన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి ఇతర ప్రమాదకర ప్రవర్తనలకి ఉన్న సంబంధాలను, లైంగిక వేధింపులు, భావ వ్యక్తీకరణ ద్వారా వ్యక్తుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవటంపై అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం జరిగిన పోస్టర్ మేళాలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం అధికారి రమేష్ సంజీవ, ఎంఈఓలు హరిశ్చందర్, కిషన్, భాగ్యమణి, ఎస్‌సీ ఈఆర్‌టీ ఫ్యాకల్టీ మధుసూదన్ రెడ్డి, కూకట్‌పల్లి యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, హెచ్‌ఎం నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మమత అకాడమీ మెడికల్ సైన్స్‌లో 'స్వచ్ఛభారత్'


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లి మమత అకాడమీ మెడికల్ సైన్స్‌లో ద్వితీయ సంవత్సరం వైద్య విద్యార్థులు శనివారం 'స్వచ్ఛ భారత్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ పాటిల్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్, కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి బాలుడికి గాయాలు

దుండిగల్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి బాలుడు గాయపడిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి హౌసింగ్ కాలనీలోని కృషి స్కూల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవపంలో అసముద్దీన్ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే కుటుంబంతో నివసిస్తున్నాడు. శనివారం అతని కుమారుడు అక్తర్ (8) ఆడుకుంటూ భవనంపై నుంచి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు గమనించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న గణేశ్

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ మూడో వార్డులో ముస్లింలు నిర్మించిన మసీద్‌కు మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేశ్ శనివారం రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో దొంతి మహేశ్ ముదిరాజ్ , అమరం ముత్యాంరెడ్డి, వపుల శ్రీనివాస్, సిరగాళ్ల బాబు, పిట్ల శివరాజ్, ముస్లిం మత పెద్దలు సాదక్, జబ్బార్, అక్రం, ఇర్ఫాన్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నివారణకే ఫ్లైఓవర్ల నిర్మాణం


పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: ట్రాఫిక్ నివారణకే చౌరస్తాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపట్టామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి చౌరస్తాలో కొనసాగుతున్న ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనులను మేయర్ నీలారెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాచుపల్లి చౌరస్తాలో రూ. 146 కోట్ల నిధులతో చేపడుతున్న బాచుపల్లి–మియాపూర్ ఫ్లై ఓవర్, బాచుపల్లి–మల్లంపేట్–భౌరంపేట్ రోడ్డు పనులతో పాటు రూ.135 కోట్లతో చేపడుతున్న మియాపూర్–బాచుపల్లి–గండిమైసమ్మ రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిస్తామన్నారు. ఫ్లై ఓవర్ పనులకు అంతరాయంగా ఉన్న కరెంట్ స్తంభాలను యుద్ధప్రాతిపదికన తరలించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వారి వెంట డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, హెచ్ఎండీఏ ఎస్ఈ హుస్సేన్, నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ సౌజన్య, ఎలక్ట్రికల్ కన్‌స్ట్రక్షన్స్ డీఈఈ శ్రీదేవి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్, వాటర్ వర్క్స్ జీఎం సుబ్బారాయుడు, కార్పొరేటర్లు ఉన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష..

నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం 'అభివృద్ధి పనుల పురోగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్మాణ దశలో ఉన్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ జిమ్, పార్కులను సక్రమంగా నిర్వహించడంతో పాటు నూతన ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పార్కుల వద్ద హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో పాటు నీటి సదుపాయం కల్పించాలని సూచించారు.

విద్యాధికారులతో సమావేశం..

పేట్ బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి మండలాలకు చెందిన మండల విద్యాధికారులు జెమిని ఎస్ఎస్ కుమారి, కృష్ణ, రామకృష్ణ ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన దుండిగల్, బాచుపల్లి మండలాల్లో ఎంఈఓ కార్యాలయాల భవనాలు నిర్మించాలని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వాచ్‌మెన్, తాగునీటి సదుపాయాల వంటి పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. సమావేశంలో మండల రిసోర్స్ పర్సన్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బాచుపల్లి ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

ముగిసిన చార్మినార్ రీజియన్ స్పోర్ట్స్ మీట్ - 2024


స్పోర్ట్స్ మీట్‌లో పోటీ పడుతున్న అటవీ అధికారులు

సుభాష్‌నగర్: ధూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో రెండు రోజుల పాటు జరిగిన చార్మినార్ రీజియన్ స్పోర్ట్స్ మీట్–2024 శనివారం ముగిసింది. పోటీల్లో రంగారెడ్డి జిల్లా, జూ పార్క్, హైదరాబాద్ జిల్లా, మేడ్చల్ జిల్లా, అరణ్య భవన్, ఎఫ్‌సీఆర్ఐ కాలేజీ, టీఎస్ఎఫ్‌టీసీ, హెచ్ఎండీఏ, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల, తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలకు చెందిన 255 మంది అటవీ అధికారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ఐఎఫ్ఎస్ పీసీసీఎఫ్ ఏలుసింగ్ మెరూ హాజరై విజేతలకు మెడల్స్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్, సీఎఫ్. చార్మినార్ సర్కిల్ శివాల రాంబాబు, ఐఎఫ్ఎస్ తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ రమేశ్, వివిధ జిల్లా , అరణ్య భవన్, ఎఫ్‌సీఆర్ఐ కాలేజీ, జూ పార్క్, డివిజనల్ అటవీ అధికారులు తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, పీటీఐలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి



కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలో శనివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బ్రిటీష్ కబంధ హస్తాల నుంచి దేశ ప్రజలకు స్వేచ్ఛావాయువులు అందించేందుకు సర్దార్ భగత్‌సింగ్ తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు.



బతుకమ్మ కుంటల పనుల పరిశీలన


సోమయ్యనగర్ బతుకమ్మ కుంటను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: అక్టోబర్ 2 నుంచి బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని సోమయ్యనగర్, కూనా మహాలక్ష్మీనగర్‌లోని బతుకమ్మ కుంటల పనులను కార్పొరేటర్ కొలుకుల జగన్ శనివారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ ఏఈ తిరుపతి, డీఈ రూపాదేవితో పాటు మున్సిపల్ అధికారులు, వివిధ కాలనీలకు చెందిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు


కూనా మహాలక్ష్మీనగర్‌లోని బతుకమ్మ కుంట..

రేబిస్ నివారణకు కృషి చేయాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పశు వైద్యురాలు సంధ్యారాణి, సంధ్య అన్నారు. శనివారం అంతర్జాతీయ జునోసిస్ డే సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లిలోని పశువుల వైద్యశాలలో ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్‌ను జంతువులకు ఇచ్చారు. ఈ సందర్భంగా పశు వైద్యురాలు సంధ్యారాణి యూపీహెచ్‌సీ డాక్టర్ దీప్తితో కలిసి రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. పెంచుకునే కుక్కలకు, జంతువులకు వాటి యజమానులు రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.